భవిష్యత్ బాటకు ఒలంపియాడ్ విద్య..




2



2

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## రికార్డుస్థాయిలో తైబజార్ వేలం




**అక్షరటుడే, గాంధారి:** మండలంలో శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మమ్మాయి రేణుక సంజీవ్ యాదవ్ అధ్యక్షతన తైబజార్ వేలంపాట నిర్వహించారు. ఇందులో నలుగురు బిడ్డర్లు పాల్గొన్నారు. వీరిలో తైబజార్‌ను రూ.9.10లక్షలకు మురళి దక్కించుకోగా.. చిట్టీ వేలంపాటను రూ. 4.32 లక్షలకు శ్రీధర్ సొంతం చేసుకున్నాడు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, 13వ వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ సంజీవ్ యాదవ్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


28-3-2026

NIZAMABAD / KAMAREDDY

PAGES - 2


## హనుమాన్ జయంతి నేపథ్యంలో నిబంధనలు పాటించాలి: సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** హనుమాన్ జయంతి సందర్భంగా నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రజలంతా నిబంధనలు పాటించాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తుగా జాగ్రత్తలు చేపట్టామని సీపీ తెలిపారు. ఈ మేరకు నిషేధాజ్ఞలను జారీ చేయడం జరిగిందన్నారు. ప్రజలు, ఆయా పార్టీల నాయకులు సమావేశాలు, సభలు నిర్వహించాలనుకుంటే తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. మతపరమైన విద్వేషాన్ని రగిల్చే విధంగా ప్రసంగాలు చేయడం కాని.. అలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండే స్వభావం గల వస్తువులు, హాని కలిగించే ఇతర పదార్థాలను తీసుకువెళ్లడాన్ని పూర్తిగా నిషేధించామని సీపీ తెలిపారు.



## ఎస్సెస్సీ పరీక్షల తీరుపై కలెక్టర్ ఆగ్రహం..

### చీఫ్ సూపరింటెండెంట్‌కు షోకాజ్ ఇవ్వాలని ఆదేశం..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్, ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను, సీసీ కెమెరా వ్యవస్థను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, బందోబస్తు, తాగునీరు, ప్రథమ చికిత్స వసతి వంటి వాటిని పరిశీలించారు. బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్‌లో పరీక్షల నిర్వహణలో పలు లోపాలను గుర్తించిన కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం కల్పిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు సత్యకుమారి, ఎస్.వెంకట్రామ్ రెడ్డి ఉన్నారు.






**నిజామాబాద్ నగరపాలక సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపింది. శనివారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ కూరగాయల ఉమారాణి అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.**

**- అక్షరటుడే, నిజామాబాద్ సిటీ**

# కార్పొరేషన్ బడ్జెట్‌కు ఆమోదం

### అన్ని డివిజన్లనకు..

అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులో అన్ని డివిజన్లకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ అధికారులకు మహేశ్ గౌడ్ సూచించారు. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ అమలు అనివార్యంగా మారిందన్నారు. ఇప్పటికే ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరిగిందని, ఎవరికీ ఎలాంటి అన్యాయం జరుగకుండా ఉండేందుకు ముసాయిదా ప్లాన్‌లో ఏవైనా సవరణలు చేయాల్సి ఉంటే వాటిని చేపట్టేందుకు వీలుగా కార్పొరేటర్లతో భేటీ నిర్వహించాలని సూచించారు.

- బల్దియా పద్దు రూ.247 కోట్లు
- వార్డుల్లో సమస్యలు లేవనెత్తిన సభ్యులు
- పరిష్కరిస్తామని పీసీసీ చీఫ్, ఎమ్మెల్యే హామీ

కార్పొరేషన్ 2026-27 ప్రతిపాదిత బడ్జెట్‌తో పాటు, 2025-26 సవరించిన అంచనా బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2025 ఏప్రిల్ 1 నాటికి ప్రారంభ నిల్వ రూ.94.71 కోట్లు కాగా.. 2025-26 సవరణ అంచనా ఆదాయం రూ. 137.17 కోట్లు. మొత్తం కలుపుకుని గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ.231.88 కోట్లుగా పేర్కొన్నారు. 2026-27 సాధారణ నిధుల అంచనా ఆదాయం రూ.147.63 కోట్లుగా పొందుపరిచారు. ప్లాన్ అండ్ నాన్ ప్లాన్ గ్రాంట్ల ద్వారా రూ.99.37 కోట్లు సమకూరుతుందని అంచనా వేశారు. మొత్తం అంచనా వ్యయం రూ.247 కోట్లుగా పద్దులో పేర్కొన్నారు. ప్రతిపాదిత బడ్జెట్ వివరాలను చదివి వినిపించగా, సభ్యులు ఆమోదం తెలిపారు.

### ఎన్నికల వరకే రాజకీయాలు

తమతమ డివిజన్లలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్లు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితమని, నిజామాబాద్ నగర అభివృద్ధే ధ్యేయంగా అందరం పార్టీలకు అతీతంగా కృషి చేద్దామని ఎమ్మెల్సీ అన్నారు. నగరానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు.

### అంకితభావతో కృషి చేయాలి

ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం వాటిల్లకుండా, వారికి జవాబుదారీగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్పొరేటర్లు ప్రస్తావించే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అంకిత భావంతో కృషి చేయాలన్నారు. ఆయా డివిజన్లలో నెలకొని ఉన్న సమస్యలపై చర్చించి, పరిష్కారం చూపేందుకు వీలుగా నెల రోజులలోపే మేయర్ అనుమతితో నగర పాలక సంస్థ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. కార్పొరేషన్ ఆదాయ వనరులను పెంపొందించుకునేందుకు వీలుగా ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా పారదర్శకంగా పరిష్కరిస్తూ అర్హత కలిగిన వారికి అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, నగర పాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.




## 'ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు పెద్ద స్కాం..'

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు పెద్ద స్కాంలాగా కనిపిస్తోందని.. దీనిపై కచ్చితంగా పూర్తి విచారణ జరగాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ బడ్జెట్ ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో హైదరాబాద్, వరంగల్ తర్వాత అతిపెద్ద నగరం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అని అన్నారు. ఈ ప్రాంతంలో రెవెన్యూ పెంచుకొనే అవకాశం ఎక్కువగా ఉందని, తమ పార్టీ కార్పొరేటర్లు దీనికి పూర్తిగా సహకరిస్తారన్నారు. అర్బన్‌లో పన్నుల పరంగా ఇప్పటికే రూ.100 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఆయా పన్నుల్లో చాలా తేడా ఉందని వాటిని సవరించాల్సిన అవసరం ఉందన్నారు.



## నాల్గోరోజు ప్రశాంతంగా పరీక్షలు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో పదో తరగతి పరీ క్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం గణిత శాస్త్రం పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 13,154 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 13,122 హాజరయ్యారు. 32 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కామారెడ్డి పట్టణంలో పరీక్షల తీరును ఎస్పీ రాజేశ్ చంద్ర పరిశీలించారు. పట్టణంలోని బాయ్స్ హైస్కూల్, జీవధాన్ పాఠశాలల పరీక్షా కేంద్రాలను పరిశీలించి భద్రతా చర్యలపై ఆరా తీశారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బీఎన్ఎస్ సెక్షన్ ఖచ్చితంగా అమల్లో ఉండేలా చూడాలని, అనవసరంగా గుమిగూడే వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



## యంగ్ ఇండియా స్కూల్ భవనాలను నాణ్యతతో నిర్మించాలి: కలెక్టర్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** యంగ్ ఇండియా స్కూల్ భవనాలను నాణ్యతతో నిర్మించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఈ మేరకు జుక్కల్ జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న స్కూల్ పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్ కలెక్టర్‌ను మండల కేంద్రానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్కూల్ నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను సమగ్రంగా పరిశీలించారు. పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అక్కడి కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అంతకు ముందు మద్నూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, సౌకర్యాలపై విద్యాశాఖ అధికారి రాజును అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య, భద్రత దృష్ట్యా వైద్య సిబ్బంది, అవసరమైన మెడిసిన్‌ను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

## కవిత వ్యాఖ్యలపై బీజేపీ మహిళా ప్రజాప్రతినిధుల ఆగ్రహం..



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** కొత్త పార్టీ తేదీని ప్రకటించే క్రమంలో ఎంపీ అర్వింద్‌పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు చేసిన వ్యాఖ్యలపై బీజేపీ మహిళా ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో శనివారం పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీ అర్వింద్‌పై కవిత చేసిన వ్యాఖ్యలపై బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ దంపల్లి జ్యోతి విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిజామాబాద్ వచ్చి తాను తెలంగాణ ఆడబిడ్డను, నిజామాబాద్ కోడలిని అని కవిత చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం ఇందూరుకు వచ్చినప్పుడు, రాజకీయ అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఆమెకు తాను ఆడబిడ్డను, కోడలిని అన్న విషయం గుర్తుకు వస్తుందా? అని ప్రశ్నించారు. ఇందూరు జిల్లాలో ఎంపీ అర్వింద్ ధర్మపురి ఏకంగా పది ఆర్వోబీలు, ఆర్‌యూబీలు మంజూరు చేయించారని జ్యోతి గుర్తు చేశారు.

## ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి: పీసీసీ చీఫ్



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నగరస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ నిజామాబాద్‌ను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై కీలక సూచనలు చేశారు. నగరంలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, స్ట్రీట్‌లైట్లు వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండే సేవలను వేగవంతం చేయాలని, ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, బడ్జెట్‌లో ప్రతిబింబించే విధంగా ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నగర అభివృద్ధికి అవసరమైన నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, పారదర్శకతతో పనులు చేపట్టాలని సూచించారు.




## కామారెడ్డి మున్సిపల్ బడ్జెట్ రూ.70.86 కోట్లు..

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపల్ బడ్జెట్ సమావేశం శనివారం మున్సిపల్ ఛైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి అధ్యక్షతన నిర్వహించారు. బడ్జెట్ ఆమోదానికి ముందు స్థానిక సమస్యలపై కౌన్సిలర్లు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. వార్డు ఆఫీసర్ల నుంచి మొదలుకుని కమిషనర్ వరకు అధికారులపై ఫైర్ అయ్యారు. సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలమవుతున్నారని కౌన్సిలర్లు ఆరోపించారు. కౌన్సిలర్లు ఫోన్ చేస్తే అధికారుల నుంచి స్పందన కరువైందని ఆరోపించారు. ఇలా అయితే వార్డుల్లో ప్రజలకు సమాధానం ఏం చెప్తామని నిలదీశారు. టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్, కమిషనర్ రాజేందర్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన ఫోన్‌కు కూడా కమిషనర్ స్పందించడం కావడం లేదని ఛైర్ పర్సన్ ఉమారాణి ఆరోపించారు. దాంతో టీపీవోను, కమిషనర్‌ను సరెండర్ చేయాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు వివిధ సమస్యలపై వాడీవేడిగా చర్చించారు. ఆ తర్వాత బడ్జెట్‌ను అధికారులు చదివి వినిపించగా కౌన్సిల్ సభ్యులు చేతులెత్తి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ప్రస్తుత 2026-27కుగాను.. వార్షిక బడ్జెట్‌ను అధికారులు రూపొందించారు. వివిధ మార్గాల ద్వారా ఆదాయాన్ని రూ.70,86,77,000లుగా చూపించారు. అదేవిధంగా ఖర్చులు సైతం రూ.70,85,43,000గా తేల్చారు. గత సంవత్సర బడ్జెట్ అంచనా రూ.46,86,76000 ఉండగా ఖర్చు రూ.46,78,73,000 ఉంది. ఈ ఏడాది ఆదాయం మార్గాలను గణనీయంగా పెంచారు. పన్నుల ద్వారా రూ.20,74,28,000గా చూపించారు. పన్నేతర ద్వారా రూ. 12,20,72,000 డిపాజిట్లు, అడ్వాన్స్, లోన్ల ద్వారా రూ.4.20 కోట్లు, క్యాపిటల్ ప్రాజెక్టు ఫండ్స్ ద్వారా రూ.33 కోట్ల 71 లక్షల 77 వేల ఆదాయం వస్తున్నట్టుగా బడ్జెట్లో పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కాసర్ల గోదావరి, అదనపు కలెక్టర్ మధు మోహన్, కామారెడ్డి ఆర్డీవో ఎన్‌వై గిరి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

# విద్యార్థుల బంగారు భవితకు బాట..

# ఒలంపియాడ్ విద్య..

నేటి ఆధునిక ప్రపంచంతో విద్యార్థులు పోటీపడడం అంత సులభం కాదు. టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతుండడం, ప్రపంచ ఆలోచన సరళి మారిపోతున్న వేళ.. విద్యా విధానంలోనూ అనేక మార్పులు వస్తున్నాయి. ఇలాంటి తరుణంలో విద్యార్థులు ప్రపంచంతో పోటీపడి నిలబడాలంటే ఒలంపియాడ్ విద్య అనివార్యంగా మారిపోయింది. దీంతో ఈ విద్యకు మెట్రోపాలిటన్ సిటీలే కాదు.. ద్వితీయ శ్రేణి నగరాల్లో సైతం ఆదరణ బాగా పెరిగింది.

**- అక్షరటుడే, ఇందూరు**




ఒలంపియాడ్ విద్య అభ్యసించాలంటే విద్యార్థులను మెట్రోపాలిటన్ సిటీలకు పంపాల్సి వచ్చేంది. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన కాకతీయ విద్యాసంస్థల యాజమాన్యం.. నిజామాబాద్ నగరంలోనే ఆరేళ్ల క్రితం కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విద్యా విధానాన్ని అందుబాటులోకి తీసురావడంతో విద్యార్థులు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం తప్పింది. మనకు అందుబాటులోనే ఉత్తమ విద్య అందుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆకర్షితులవుతున్నారు.

### జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు

కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో విద్యనభ్యసించిన అనేక మంది విద్యార్థులు జాతీయ స్థాయి ఐఐటీ, మెడికల్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకున్నారు. కేవోఎస్ స్కూల్ ఏర్పాటు చేసిన ఆరేళ్లలోనే చాలామంది విద్యార్థులు బాగా రాణించారు.

### మెట్రోపాలిటన్ సిటీ విద్యార్థులకు దీటుగా..

మెట్రోపాలిటన్ సిటీల్లో ఐఐటీ ఫౌండేషన్ చదువుతున్న విద్యార్థులతో పోటీపడడం అనేది చాలా కష్టం. అదీ ఇంటర్మీడియట్ స్థాయిలో జాతీయస్థాయి పోటీ పరీక్షలైన ఐఐటీ, మెడికల్‌లో నేషనల్ ర్యాంకులు సాధించడం అసాధ్యమనే చెప్పాలి. కానీ, ఒలంపియాడ్ విద్యలో స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌తో కూడిన బోధన అందించడంతో ఇది సాధ్యమైందని కేవోఎస్ డైరెక్టర్ రామోజీ రావు చెబుతున్నారు. తాను ఐఐటీయన్ కావడంతో.. నిజామాబాద్ జిల్లాలో మరెంతో మందిని ఐఐటీ విద్య వైపు మళ్లించే ఉద్దేశంతో 'కేవోఎస్'ను స్థాపించి ఒలంపియాడ్ విద్యను అందుబాటులోకి తెచ్చారు.

### విద్యార్థులకు ఉత్తమ విద్య

ఒలంపియాడ్ విద్య అనేది విద్యార్థి జ్ఞానాన్ని, నైపుణ్యాలు ఎంతోగానో మెరుగుపరుస్తుంది. ఆలోచనా సామర్థ్యాన్ని పెంచడంలో దోహదం చేస్తుంది. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఒలంపియాడ్ విద్య అందించేందుకు నిజామాబాద్ లో 'కేవోఎస్'ను ప్రారంభించాం. మా స్కూల్‌లో చదివిని విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు.

### ఒలంపియాడ్ విద్య అంటే..

ఒలంపియాడ్ విద్యలో చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ఇందులో భాగంగా ఉదయం రెగ్యులర్ స్కూల్ సిలబస్‌పై శిక్షణ ఇస్తారు. నిత్యం ప్రతి సబ్జెక్టుపై ఇంటర్, ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో బోధన ఉంటుంది. అయితే విద్యార్థులపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఇందుకోసం పిల్లలతో ఆటలు ఆడిస్తారు. ఫిజికల్ ఆక్టివిటీస్ చేయిస్తుంటారు. దీంతో విద్యార్థులు ఏమాత్రం ఒత్తిడి లేకుండా ఐఐటీ, మెడికల్ బోధన ను సులువుగా అర్థం చేసుకుంటారు. ప్రతి సబ్జెక్టుపై పూర్తి పట్టు సాధిస్తారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఒలంపియాడ్ విద్య దోహదం చేస్తుండడంతో ఆసక్తి కనబరుస్తున్నారు.

## విద్యార్థులకు ఉత్తమ విద్య



ఒలంపియాడ్ విద్య అనేది విద్యార్థి జ్ఞానాన్ని, నైపుణ్యాలు ఎంతోగానో మెరుగుపరుస్తుంది. ఆలోచనా సామర్థ్యాన్ని పెంచడంలో దోహదం చేస్తుంది. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఒలంపియాడ్ విద్య అందించేందుకు నిజామాబాద్‌లో 'కేవోఎస్'ను ప్రారంభించాం. మా స్కూల్‌లో చదివిని విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు.

**– రామోజీ రావు, కేవోఎస్ డైరెక్టర్**

## ఉత్తమ ర్యాంకులు



ఆధునిక ప్రపంచంతో విద్యార్థులు పోటీ పడాలంటే ఒలంపియాడ్ విద్య ఎంతో అవసరం. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది. జాతీయ స్థాయి ఐఐటీ, మెడికల్ ప్రవేశ పరీక్షల్లో రాణించాలంటే ఒలంపియాడ్ విద్య ప్రధానం అయ్యింది.

**– తేజస్విని, కేవోఎస్ డైరెక్టర్**

## వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

**అక్షరటుడే, కోటగిరి :** బాన్సువాడ నియోజకవర్గంలోని కోటగిరి, పోతంగల్, రుద్రూరు, మండలాల్లో వరికోతలు మొదలైనందున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయా మండలాల్లో ఆయన పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు దళారులకు అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక ఒక్క క్వింటాకు రూ.300 నుంచి రూ.400 వరకు నష్టపోతున్నారన్నారు. రైతుల గోసను గమనించి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆయన కోరారు. లేకపోతే రైతులందరినీ ఏకం చేసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్



గౌడ్, బీజేపీ కోటగిరి మండల అధ్యక్షుడు ఏముల నవీన్, రుద్రూర్ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, నియోజకవర్గ సీనియర్ నాయకులు మార్కెలి ప్రకాష్ పటేల్, వడ్లసాయినాథ్, గుంజరి జగదీష్, కమ్మరి శివశంకర్, మామిడి శ్రీనివాస్, సాయిలు, సీనియర్ నాయకులు జీలకర్ర విజయ్, గణేష్ పటేల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి.. పలువురి అరెస్ట్

**అక్షరటుడే నిజామాబాద్ క్రైం:** పేకాట స్థావరంపై సీసీఎస్ పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో సీసీఎస్ సిబ్బంది 6వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారంగాపూర్‌లో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ సందర్భంగా 8మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి ఏడు సెల్‌ఫోన్లు, రూ.5,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని 6వ టౌన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు.

## రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలి




**అక్షరటుడే, ఆర్మూర్ :** రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ఉజ్వల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలూరు మండలంలోని మచ్చర్ల నుంచి దేగాం, మిర్దాపల్లి గ్రామాల మధ్య అడవి దూదికాయలు తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మచ్చర్ల నుంచి దేగాం, మిర్దాపల్లి గ్రామాల మీదుగా ఆర్మూర్ కు వెళ్లే వారికి రహదారులపై ఎండిపోయిన అడవి దూదికాయలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీంతో వీటిని తొలగించామన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ గౌడ్, దేగాం శ్రీకాంత్ గౌడ్, సురేష్, రాము, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## పోచంపాడ్‌లో భక్తిశ్రద్ధలతో రాములోరి శోభాయాత్ర



**అక్షరటుడే, మెండోరా:** పోచంపాడ్ ప్రాజెక్టు ప్రాంతంలో రాములవారి శోభాయాత్రను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రథం సంచరిస్తుండగా 'జై శ్రీరామ్' నినాదాలతో వీధులన్నీ మార్మోగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి హారతులు ఇస్తూ, కొబ్బరికాయలు కొట్టి తమ భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్, చందు, గడ్డం రమేష్, శ్రీనివాస్ పంతులు, రాంప్రభు పాల్గొన్నారు. అలాగే ఎస్సై సుహాసిని హాజరై భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తి వాతావరణంలో శోభాయాత్ర శాంతియుతంగా కొనసాగించాలని తెలిపారు.

## ఎన్ఎస్ఎస్ వేసవికాల శిబిరం ప్రారంభం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో లక్ష్మాపూర్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల వేసవికాల ప్రత్యేక శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మాపూర్ సర్పంచ్ మంజుల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరాన్ని ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చదువుతో పాటు సమాజ సేవను తమ బాధ్యతగా భావించి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్ మాట్లాడుతూ సమాజసేవే మాధవ సేవగా భావించాలన్నారు. అనంతరం లక్ష్మాపూర్ సర్పంచ్ మంజుల మాట్లాడుతూ తమ గ్రామాన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్‌లో భాగంగా ఎంపిక చేసుకున్నందుకు ప్రోగ్రాం ఆఫీసర్ రాణికి, విద్యార్థినులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ శివకుమార్, తెలుగు సీనియర్ అధ్యాపకులు ప్రభాకర్ రావు పాల్గొన్నారు.




## గాంధారిలో కనుల పండువగా రథోత్సవం

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని గౌరారం గ్రామంలో అతి పురాతన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం కనుల పండువగా రథోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు సురేందర్ హాజరై సీతారాముల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది, గ్రామస్థులు కలిసి ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తానాజీ రావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు



## మైసమ్మ దేవాలయం వద్ద బోర్ మోటార్ ఏర్పాటు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శ్రీరామనవమి, దశిమి సందర్భంగా ఆదివారం పంగిడి మైసమ్మ దేవాలయం వద్ద బోనాల పండుగ ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సర్పంచ్ అయ్యల సాయిలు ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా రిపేర్‌లో ఉన్న హ్యాండ్‌పంప్‌ను రిపేర్ చేయించారు. కార్యక్రమంలో యువకులు చురుగ్గా సేవలందించారు. ఉపసర్పంచ్ పంతుల మహేందర్, ప్రశాంత్ రాజు, సవీన్, సంతు సాయిలు పాల్గొన్నారు.

## మానసగౌడ్‌కు పీసీసీ చీఫ్ అభినందన



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇటీవల జరిగిన నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జాయింట్ సెక్రెటరీగా మానస గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమెను పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శనివారం తన స్వగృహంలో సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మానసగౌడ్ తనను అభినందించి ప్రోత్సహించిన మహేష్ కుమార్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో ఇదేవిధంగా సహాయ, సహకారాలు అందించాలని ఆకాంక్షించారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులపై నిర్లక్ష్యం..



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని కమలానెహ్రూ కాలనీలోని సీసీ రోడ్డు నిర్మాణాన్ని నాణ్యత లేకుండా నిర్మిస్తున్నారని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరా ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం రోడ్డు వేస్తున్న ప్రాంతాన్ని సందర్శించి మాట్లాడారు. రోడ్డు నిర్మాణంలో కనీసం సిమెంట్‌ను సరైన మోతాదులో కూడా వేయడం లేదని, మట్టిని సైతం సరైన పద్ధతిలో కలపట్లేదన్నారు. నాణ్యతతో కూడిన నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడురాజన్న, టీయూసీఐ ఆర్మూర్ మండల నాయకులు ఎండీ నజీర్, కాలనీవాసులు స్వరూప పాల్గొన్నారు.



## వెంకటాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం జీపీ పాలకవర్గం, స్థానిక నాయకులు ప్రారంభించారు. కొత్త సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలు తగ్గనున్నాయని అధికారులు తెలిపారు. అభివృద్ధి పనులను చేపట్టినందుకు ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.